

కరీంనగర్: కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరం వంటావార్పులో కూరగాయలు కోస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

# ఇచ్చిన హామీ నెరవేర్చాలి

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 25 : తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఈ నెల 10 నుంచి నిరవధిక దీక్షలు చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు, రోజుకోతీరున నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీక్షలు బుధవారానికి 16 రోజులు కాగా, కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరంలో వంటావార్పు చేపట్టారు. అక్కడే వంట చేసి, సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా సర్కారు తీరుపై ఆగ్రహించారు. పదహారు రోజులుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే తమను రెగ్యులరైజ్ చేస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకూ నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా గౌరవాధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుండా రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్, రవిచంద్ర పాల్గొన్నారు.

# కిలేడీ వలపు వల!

- బ్లాక్ మెయిల్ చేసి పలువురి వద్ద డబ్బుల డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో రూ.కోటి దాకా వసూలు!
- మూడు జిల్లాల్లో కేసులు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- మహిళా హోంగార్డు తీరుతో పోలీస్ శాఖకు కళంకం



వేములవాడ, డిసెంబర్ 25: వలపు వల విసురుతూ.. బ్లాక్ మెయిల్ చేస్తూ ఓ కిలేడీ ఆర్థికంగా ఉన్న పలువురు వ్యక్తుల నుంచి రూ.కోటి దాకా లూటీ చేసింది. హోంగార్డుగా పనిచేస్తూ, ఆమె వ్యవహరించిన తీరు ఆ పోలీస్ శాఖకే కళంకం తెచ్చిపెట్టింది. ఈ ఘటన వేములవాడలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సదరు మహిళా హోంగార్డు కొంతకాలం వేములవాడలో పనిచేసిన సమయంలో రాజన్న ఆలయంలో ఏఈగా పనిచేసి రిటైర్డ్ అయిన శేఖర్ అనే వ్యక్తితో పరిచయం పెంచుకున్నది. ముందుగా తన భర్త ఆరోగ్యం బాగాలేదని చెప్పి, అతని నుంచి దాదాపు ₹5లక్షలు తీసుకున్నది. డబ్బులు తిరిగి అడిగిన క్రమంలో శేఖర్ ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేయగా, దీనిపై వేములవాడ ఠాణాలో ఈనెల 5న కేసు నమోదైంది. అలాగే వేములవాడ రూరల్ మండలం అనుపురం గ్రామానికి చెందిన పర్శరామ్‌తో పరిచయం పెంచుకొని ఏకంగా ₹45 లక్షలు కాజేసింది. మోసపోయానని తెలుసుకున్న పర్శరాం అక్టోబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంకా హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు న్యాయవాదులతో కలిసి ఉన్న ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతూ ₹15 లక్షలు డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంలోనూ వేములవాడ పట్టణ ఠాణా, హైదరాబాద్‌లో ఈ నెల 3న కేసు నమోదైంది. మరో ఘటనలో వేములవాడలోని సుభాష్‌నగర్‌కు చెందిన వేముల సుజాతను మోసం చేసింది. పట్టణంలో దుకాణం నిర్వహిస్తున్న సుజాతతో కిలేడీ మహిళ కానిస్టేబుల్‌గా పరిచయం చేసుకున్నది. ఖరీదైన కార్లలో ఆమె దగ్గరికి వస్తూ, అప్పుడప్పుడూ షాపులో ఉద్దెర పెడుతూ అప్పు తీసుకునే స్థాయికి పరిచయాన్ని పెంచుకున్నది. దాదాపు ₹9లక్షలు తీసుకున్నది. డబ్బులు అడిగితే రేపు మాపు అంటూ ముఖం చాటేయడంతో బాధితురాలు ఈ నెల 11న వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో వేములవాడకు చెందిన వ్యక్తితో పరిచయం ఉండగా అతను దుబాయి వెళ్లిన తర్వాత ₹20లక్షల వరకు వసూలు చేసినట్టు తెలిసింది. దీనిపై బాధితుడు ఇటీవలే వేములవాడకు వచ్చి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్టు తెలిసింది.

### మూడు జిల్లాల్లో ఫిర్యాదులు

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో హోంగార్డుగా పనిచేసిన ఆ మహిళ, మూడు జిల్లాలోనూ అలాగే వ్యవహరించినట్లు తెలిసింది. ఈ మూడు జిల్లాలలో ఆమెపై ఎనిమిది కేసులు నమోదైనట్టు పోలీస్ శాఖ ద్వారా తెలిసింది. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లోనే నాలుగు కేసులు ఉండగా, జగిత్యాలలో రెండు, కరీంనగర్ పట్టణంలోనూ మరో రెండు ఫిర్యాదులు పోలీసులకు అందినట్లు సమాచారం. అవసరమైతే వల, లేదంటే బ్లాక్‌మెయిల్ చేస్తూ వచ్చిన కిలేడీ దోపిడీ వ్యవహారం ఇటీవలే బయటికి రాగా, బాధితులు ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయిస్తుండడం ఉమ్మడి జిల్లాలో కలకలం రేపుతున్నది.

# ఓపెన్ స్కూల్లో తత్కాల్ పద్ధతిలో అడ్మిషన్లు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 25: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2024–25 సంవత్సరానికి గానూ పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు గాను తత్కాల్ పద్ధతిలో ఈ నెల 24 నుంచి 30 దాకా అవకాశం కల్పించినట్లు కరీంనగర్ డీఈవో జనార్ధన్ రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్ రావు బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా, అభ్యర్థులు https://www.telanganaopenschool.org/ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆ తర్వాత తప్పనిసరిగా అవసరమైన డాక్యుమెంట్స్ సంబంధిత సెంటర్‌లో అందజేయాలని సూచించారు. వివరాలకు 8309 212661లో సంప్రదించాలని సూచించారు.

# పల్లె ప్రకృతి వనాలపై గొడ్డలి వేటు?

మల్యాల, డిసెంబర్ 25: గ్రామీణ ప్రజల ఆహ్లాదం కోసం గత బీఆర్‌ఎస్ సర్కారు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలపై గొడ్డలి వేటు పడుతున్నది. మొక్కలు ఏపుగా పెరిగి ఇన్నాళ్లూ కనువిందు చేయగా, ఇటీవలి కాలంలో పలుచోట్ల చెట్లను ఇష్టారాజ్యంగా నరికి వేయడం అధికారుల నిర్లక్ష్యాన్ని బయటపెడుతున్నది. అందుకు మల్యాల మండలం సర్వాపూర్‌లోని పల్లె ప్రకృతివనమే నిదర్శనంగా నిలుస్తున్నది. ఏపుగా పెరిగిన చెట్లను కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కొండ్ర గంగాధర్‌ను వివరణ కోరగా, కోతుల బెడద కారణంగా గొర్రెల కాపరులు కొన్ని చెట్లను నరికివేశారని, వారిని గుర్తించి నోటీసులు జారీ చేస్తామని చెప్పారు.



పల్లెప్రకృతివనంలో నరికివేసిన చెట్లు

# వంట పాత్రలు శుభ్రమేనా..?



మల్యాల మండలం రామన్నపేట పాఠశాలలో అల్యూమినియం లేయర్ పోయి పాడైన వంట పాత్రలు



- ప్రభుత్వ పాఠశాలల్లో కాలం చెల్లిన మిడ్డేమీల్స్ గిన్నెలు
- అల్యూమినియం కోటింగ్ పోయి పాచిపట్టిపోయిన సామగ్రి
- అందులోనే దశాబ్దాలుగా భోజనం తయారీ
- మూడునాలుగేండ్లకు ఒకసారైనా మార్చకపోతే ప్రమాదమంటున్న నిపుణులు
- నూతన కుకింగ్ సామగ్రికి నిధులు వచ్చినా పంపిణీ కాని వైనం
- తాగునీటిదీ అదే దుస్థితి.. లోపించిన స్వచ్ఛత
- అటకెక్కిన మిషన్ భగీరథ కనెక్షన్లు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

**ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకి ఉపయోగించే అల్యూమినియం గిన్నెలతో ప్రమాదం పొంచి ఉన్నది. ఏండ్లుగా ఆ పాత్రలను వాడుతుండడంతో అవి విషతుల్యమయ్యే ముప్పు కనిపిస్తున్నది. మూడునాలుగేండ్లకు ఒకసారైనా వాటిని మార్చాలని, లేదంటే పిల్లల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదమున్నదని నిపుణులు చెబుతున్నా నిర్లక్ష్యం వెంటాడుతున్నది. కొత్త కుకింగ్ సామగ్రికి నిధులు వచ్చి నాలుగు నెలలైనా పాత్రలు అందజేయకపోవడం విమర్శలకు తావిస్తున్నది. మరోవైపు తాగునీటి స్వచ్ఛత అంతంతమాత్రంగానే ఉండడం ఆందోళన కలిగిస్తున్నది. నాడు కేసీఆర్ సర్కారు అందించిన మిషన్ భగీరథ కనెక్షన్లు మరిచి పూర్వ పద్ధతిలోనే బోర్లు, పాత ట్యాంకుల ద్వారానే నీటిని అందిస్తుండడం పలు సమస్యలకు దారి తీస్తుండగా, ఇప్పటికైనా యంత్రాంగం మేలుకోవాల్సి ఉన్నది.**

### సొంతంగా కొన్నాం.. ఇవ్వలేం

రాయికల్ మండలంలోని ఓ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల అది. దాదాపు పదిహేనేండ్లుగా ఆ స్కూల్లో మిడ్డేమీల్స్ తయారు చేసిన మహిళా సంఘ ఏజెన్సీ, రెండేండ్ల కిందట తమకు గిట్టుబాటు కావడం లేదని తప్పుకున్నది. అధికారులు మరో ఏజెన్సీకి తయారీ బాధ్యతలను అప్పగించారు. వంట చేయడం ఆరంభిస్తామని, పాత్రలు కావాలని విద్యాశాఖ అధికారులను అడుగగా, పాత ఏజెన్సీ వాళ్లను అడుగాలనడంతో వారిని సంప్రదించారు. తాము సొంతంగా పాత్రలు కొనుక్కున్నామని, ఇవ్వలేమని చెప్పేశారు. హైస్కూల్ కావడం, విద్యార్థుల సంఖ్య కొంత ఎక్కువగా ఉండడంతో భోజన తయారీకి పాత్రలు కొనాలంటే ఎక్కువ డబ్బులవుతాయని, తమ వద్ద అంత పెట్టుబడి లేదని కొత్త ఏజెన్సీ పేర్కొనడంతో చిక్కులు మొదలయ్యాయి. విధి లేని పరిస్థితిలో సర్పంచ్ అన్నం వండే గిన్నెను సమకూర్చాడు. పాఠశాల హెచ్‌ఎం కూర తయారీ గిన్నెను ఇచ్చాడు. సాంబారు తయారీ గిన్నెను తయారీదారులు కొనుగోలు చేసి వంట చేయడం ప్రారంభించారు. ఈ సంఘటనను బట్టి చూస్తే మిడ్డేమీల్స్ తయారీదారులకు కనీసం వంట పాత్రలు సైతం అందుబాటులో లేవన్న విషయం స్పష్టమవుతున్నది.

### కాలంచెల్లిన పాత్రలే దిక్కు

మల్యాల మండలంలోని మరో పాఠశాలలో మిడ్డే మీల్స్ తయారీకి సిద్ధం చేసిన పాత్రలు పూర్తిగా అల్యూమినీయం కోటింగ్ పోయి, పాచిపట్టాయి. అందులో అన్నం, కూర వండితే అది విషతుల్యంగా మారిపోవడం ఖాయమని ఎవరికైనా అర్థమవుతుంది. అయినా అందులోనే వండి వడ్డిస్తున్నారు. కాలం చెల్లిన అల్యూమినీయం పాత్రల్లో వంట శుభ్రమేనా..? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

జగిత్యాల, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): సర్కారు ఆధీనంలో నడిచే విద్యాలయాలు కొన్నాళ్లుగా పలు విమర్శలు ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం వికటించడం, చిన్నారులు ప్రాణాపాయ స్థితికి చేరుకోవడం, వారిని దవాఖానకు తరలించడం, చికిత్స పొందుతూ, కొందరు మృత్యువాత పడుతుండడం కొన్నాళ్లుగా వినిపిస్తున్న ముచ్చటే. మిడ్డే మీల్స్ అందించే సాధారణ ప్రభుత్వ పాఠశాలలు మొదలు కొని గురుకులాల్లో ఇటీవల పలు ప్రమాదకరమైన ఘటనలు చోటు చేసుకోగా, వాటికి హెచ్‌ఎంలను, టీచర్లను బాధ్యుల్ని చేస్తూ సస్పెండ్ చేయడం వంటి చర్యలు జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల గురుకులాల్లో భోజన మెనూను మార్చివేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో కమిటీల ఆధ్వర్యంలో మిడ్డే మీల్స్ తయారు చేయాలని ఆదేశించింది. అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యాలయాలను పరిశీలించి, భోజనం రుచిని, శుచిని పరిశీలించాలని హుకుం జారీ చేసింది. అయితే ఎన్ని చేసినా, ఎన్ని నిబంధనలు పెట్టినా అసలు వంట పాత్రలు శుభ్రంగానే ఉన్నాయా..? అవి కుకింగ్‌కు యోగ్యమేనా..? పాఠశాలల్లో పిల్లలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉందా..? అన్న ప్రాథమిక అంశాలను మాత్రం పరిశీలించడం లేదు. మెజార్టీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీ పాత్రలు కాలం చెల్లిపోయాయి. అల్యూమినియం కోటింగ్ పోయి, పాచిపట్టిపోయిన వంట పాత్రల్లోనే ఏండ్లుగా భోజనం తయారు చేసి పెడుతుండడం, స్వచ్ఛమైన తాగునీరు సైతం లేకుండాపోగా, పిల్లల ఆరోగ్యం గాలిలో దీపంగా మారిపోయింది.



మోతె పాఠశాలలో ఆరుబయట వంట చేస్తున్న నిర్వాహకులు

### అల్యూమినియం గిన్నెలు సురక్షితమేనా..?

జిల్లా వ్యాప్తంగానే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా సైతం మధ్యాహ్నం భోజనం తయారీకి అల్యూమినియం గిన్నెలను వాడుతున్నారు. అయితే ఈ పాత్రలు సురక్షితమేనా..? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తుండగా, రసాయన శాస్త్ర నిపుణులు, ప్రొఫెసర్లు మాత్రం వంటకు అల్యూమినియం గిన్నెలు వాడడం ప్రమాదకరమని చెబుతున్నారు. సుదీర్ఘకాలం ఆ పాత్రలను వినియోగిస్తే రోగాల బారిన పడే ప్రమాదమున్నదని హెచ్చరిస్తున్నారు. ఈ గిన్నెలు వేడెక్కినప్పుడు అందులోంచి లెడ్ కరిగి ఆహారంలో కలుస్తుందని, ఇది భోజనం చేసే వారి ఉదరంలోకి వెళ్తుందని చెబుతున్నారు. మనిషి శరీరంలోకి ప్రవేశించిన అల్యూమినియంలో 0.01 శాతం మాత్రమే కిడ్నీ వడగట్టగలదని, అంతకంటే ఎక్కువగా శరీరంలోకి చేరితే కిడ్నీ తన పనిని సరిగా నిర్వర్తించలేదని స్పష్టం చేస్తున్నారు. అలాగే ఆ గిన్నెల్లో ఆమ్లాలకు సంబంధించిన కూరగాయలు వండినప్పుడు అవి విషతుల్యమయ్యే ముప్పు ఉంటుందని హెచ్చరిస్తున్నారు. నిమ్మ, చింత పులుపు లాంటివి ఆమ్ల లక్షణాలు ఉన్న పదార్థాలను వండినప్పుడు పెద్ద సమస్యలు వస్తాయంటున్నారు. విధి లేని పరిస్థితుల్లో వినియోగించినా, మూడు, నాలుగేండ్లకు మించి వాడొద్దని సూచిస్తున్నారు. అంతకు మించి వాడితే క్యాన్సర్, చిత్తభ్రాంతి, రక్తహీనత, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, ఎముకల శక్తిని తగ్గించే వ్యాధులు వచ్చే ప్రమాముందని చెబుతున్నారు.

### నిధులు మంజూరైనా అందని పాత్రలు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారీ వంటపాత్రల కోసం ప్రభుత్వం నాలుగు నెలల కింద నిధులు మంజూరు చేసింది. జగిత్యాల జిల్లాలో దాదాపు 650 పాఠశాలలకు ₹85 లక్షలు వచ్చాయి. కానీ, ఇప్పటివరకు వంట పాత్రల కొనుగోలు, పంపిణీ మాత్రం పూర్తి కాలేదు. 50 సంఖ్యకు తక్కువగా ఉన్న పాఠశాలకు వంట పాత్రల కోసం ₹10వేలు, 51 నుంచి 100 మధ్య సంఖ్య ఉంటే ₹15వేలు, 101 నుంచి 250 మధ్య సంఖ్య ఉన్న వాటికి ₹20వేలు, 251 కంటే అధిక సంఖ్య ఉంటే ₹25వేలు మంజూరు చేసింది. ఈ నిధులతో వంటపాత్రలు కొని పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్నం, కూర తయారీ గిన్నెలు, దినుసులు పెట్టుకునేందుకు కంటైనర్, సాంబార్ బకెట్లు, సర్వీసింగ్ గిన్నెలు, చెంచాలు, కబ్‌గీర్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. అన్నం, కూరగిన్నెలు అల్యూమినియంవి, మిగిలినవి స్టీల్ గిన్నెలు కొనాలని ఆదేశాలు ఇచ్చారు. నిధులు మంజూరు చేసి నెలలు గడుస్తున్నా, ఇంత వరకు పాఠశాలలకు పాత్రల పంపిణీ జరగలేదు.

### ఇరవై ఏండ్లుగా అవే గిన్నెలు

దాదాపు రెండు దశాబ్దాల క్రితం మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. అప్పటి నుంచి అవే పాత్రలు భోజన తయారీకి వాడుతుండడం కనిపిస్తున్నది. మిడ్డే మీల్స్ తయారీదారులకు ప్రభుత్వమే వంట పాత్రలు ఉచితంగా సరఫరా చేసినట్టు, సిలిండర్ సౌకర్యం కల్పించినట్టు తెలుస్తున్నది. అయితే భోజన తయారీదారులు మాత్రం వంట పాత్రలను ప్రభుత్వం సరఫరా చేయలేదని, తామే స్వయంగా సమకూర్చుకున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం ప్రతి ఐదు పదేండ్లకు ఒక్కసారి పాత్రలు సరఫరా చేసినట్టు చెబుతోంది. కానీ, క్షేత్రస్థాయికి వంటపాత్రలు చేరినట్టు కనిపించడం లేదు. ఒకటి, రెండు ఏజెన్సీలకు సంబంధించిన వారు తమకు 20 ఏండ్ల క్రితం ఒకటి, రెండు గిన్నెలు ఇచ్చారని చెబుతున్నారే తప్ప 95 శాతం మంది తమకు వంట పాత్రల పంపిణీ జరగలేదనే లేదు. ఏండ్లుగా అవే గిన్నెలు వాడడం సైతం ప్రమాదాలకు కారణమని తెలుస్తున్నది.

### తాగునీరు స్వచ్ఛమేనా..?

పాఠశాలల్లో మిడ్డే మీల్స్ తయారీ గిన్నెలే కాదు, పిల్లలు తాగే నీరు సురక్షితమేనా..? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ పాఠశాలకు మిషన్ భగీరథ నీటి కనెక్షన్లను ఇచ్చింది. అయితే కొత్తగా వచ్చిన ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో మళ్లీ పూర్వపద్ధతిలోనే బోర్లు, ట్యాంకర్ల నీటిని పిల్లలు వినియోగించే దుస్థితి ఏర్పడింది. బావులు, బోర్లలోని నీరు కావడం, క్లోరినేషన్ సరిగా జరగక అనేక ఇబ్బందులు వస్తున్నాయని చాలా మంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా పాఠశాలల్లో రక్షిత మంచినీటి సౌకర్యం లేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వాపోతున్నారు. వంటపాత్రల శుభ్రత, సురక్షిత మంచినీటిని ప్రొవైడ్ చేస్తేనే ఇబ్బందులు తప్పుతాయని చెబుతున్నారు.



జగిత్యాల ధరూర్ కాలనీ స్కూల్‌లో మంచినీరు తాగుతున్న పిల్లలు

### త్వరలోనే పాత్రలు పంపిణీ చేస్తాం : విద్యాశాఖ అధికారులు

వంటపాత్రలకు నిధులు మంజూరు కావడం, పంపిణీ కాకపోవడంపై విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ, కలెక్టర్ చైర్మన్‌గా, అదనపు కలెక్టర్ నేతృత్వంలో వంట పాత్రల కొనుగోలు కమిటీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ నెల 7న టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే వంట పాత్రల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు.

# గీత దాటితే ఇక వాతే!



తెలంగాణ చౌక్‌లో ఏర్పాటు చేసిన సిగ్నల్స్

- నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నయా సిగ్నలింగ్ వ్యవస్థ
- అత్యాధునిక ఆటోమెటిక్ కెమెరాలతో ఏర్పాటు
- రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా
- రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్‌కు ₹1,000 చొప్పున ఫైన్
- హెల్మెట్ లేకపోతే ₹100
- కొత్త యేడాది నుంచే అమల్లోకి



తెలంగాణ చౌక్‌లో రోడ్డుపై మార్కింగ్ లైన్లు



ఏర్పాటు చేసిన ఆధునిక సీసీ కెమెరా

**వాహనదారులూ జర జాగ్రత్త! ఇక నుంచి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే అంతే! భారీ జరిమానా పడబోతున్నది. స్మార్ట్ సిటీ కింద ₹2కోట్లతో నగరంలోని 28 ప్రాంతాల్లో అత్యాధునిక కెమెరాలతో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను నగరపాలకసంస్థ పటిష్టం చేస్తున్నది. ఈ నెలాఖరులోగా పనులన్నీ పూర్తి చేసి పోలీసుశాఖకు అప్పగించనుండగా, కొత్త యేడాది నుంచే నిఘా కట్టుదిట్టంకానున్నది. గీత దాటితే చాలు నిఘా నేత్రాలు తీసిన ఫొటోల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే ఆటోమేటిక్‌గా వాత పడబోతున్నది. రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్‌కు ₹వెయ్యి చొప్పున, హెల్మెట్ లేకపోతే ₹వంద ఫైన్ జనరేట్ కాబోతుండగా, అప్రమత్తం కావాల్సి ఉన్నది.**

కరీంనగర్ రాంనగర్, డిసెంబర్ 24: కరీం'నగరం'లో ట్రాఫిక్ ఆంక్షలు మరింత కఠినతరం కానున్నాయి. కొత్త ఏడాది నుంచి గీత దాటితే చాలు వాహనదారుల జేబుకు చిల్లులు పడబోతున్నాయి. స్మార్ట్ సిటీ కింద నగరపాలక సంస్థ ₹2కోట్లతో 28 చోట్ల అత్యాధునిక కెమెరాలతో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నది. మెట్రోపాలిటన్ సిటీ తరహాలో కెమెరాలను నగరంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించడంతోపాటు ఆటోమేటిక్ చిప్ సిస్టంతో పనిచేసేలా అమర్చుతున్నది. ట్రాఫిక్ అనుగుణంగా ఎప్పటికప్పుడు దానికదే టైమింగ్ సెట్ చేసుకొని పనిచేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సిగ్నల్ జంక్షన్ల వద్ద మార్కింగ్ కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసే పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే పలుసార్లు ట్రయల్స్ కూడా చేశారు. పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాగానే పోలీస్ శాఖకు అప్పగించనుండగా, ఆ తర్వాతే గీత దాటిన వారిపై వాత పడనున్నది.

### ఉల్లంఘనులకు తప్పదు జరిమానా

ట్రాఫిక్ సిగ్నల్ జంక్షన్ల వద్ద మార్కింగ్ దాటితే ఎవరూ చూడడం లేదని అనుకోవద్దు. మునుపటిలా ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై నిల్చొని ఫొటోలు తీయడం లేదని భావించొద్దు. ఎవరితో పనిలేకుండా సిగ్నల్స్ వద్ద ఏర్పాటు చేసిన అత్యాధునిక కెమెరాలు ఎప్పటికప్పుడు వాహనాల ఫొటో తీసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పంపనుండగా, నిబంధనలను ఉల్లంఘించిన వారికి ఆటోమేటిక్‌గా చలానా జనరేట్ అవుతుంది. సిగ్నల్ జంపింగ్‌తోపాటు మార్క్ లైన్ దాటిన వారికి ₹వెయ్యి, రాంగ్‌రూట్ ₹వెయ్యి, హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనదారుడికి ₹వంద చొప్పున జరిమానా పడనున్నది.

# రాజన్న ఆలయంలో హుండీ నగదు చోరీ

- నాలుగు రోజులుగా చేతివాటం ప్రదర్శిస్తున్న మైనర్లు
- ముగ్గురు చిన్నారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



హుండీలో నుంచి నగదు తీస్తున్న బాలుడు (సీసీ కెమెరా చిత్రం)

వేములవాడ, డిసెంబర్ 25: వేములవాడ రాజరాజేశ్వరుడి క్షేత్రంలో భద్రత కరువవుతున్నదా..? సిబ్బంది పర్యవేక్షణ కొరవడుతున్నదా..? అంటే అవుననే సమాధానం వస్తున్నది. సాక్షాత్తూ ఆలయ హుండీలకే కన్నం వేయడం చూస్తుంటే పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. నాలుగు రోజులుగా మైనర్లు చోరీకి పాల్పడుతున్నా గుర్తించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. రాజన్న ఆలయంలో మొత్తం నాలుగు పెద్ద హుండీలు, ఎనిమిది చిన్న హుండీలు ఉన్నాయి. ఇటీవల భక్తుల నుంచి నగదు కానుకలు పెరిగి హుండీలు నిండిపోయాయి. బుధవారం ముగ్గురు మైనర్లు సాధారణ భక్తుల్లా రాజన్న ఆలయం లోపలికి వచ్చి, హుండీలోని నగదు దొంగలిస్తూ సిబ్బందికి చిక్కారు. దాంతో పోలీసులకు సమాచారం అందించారు. వారి వద్ద నుంచి రూ.2800 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసు విచారణలో ఆదివారం కూడా రూ.7వేలు కాజేసినట్టు తెలిసింది. ఆలయ భద్రత సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు వారిని విచారిస్తున్నట్టు వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.